క్లుప్తంగా

నో బ్యాగ్ డే



జీపీ వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

మానకొండూర్: గన్నేరువరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు, బడి పట్ల భయాన్ని పోగొట్టి చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని హెచ్ఎం కట్టా రవీంద్రచారి తెలిపారు. 6,7 తరగతుల విద్యార్థులు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ, ఉద్యోగుల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, రికార్డులు, ప్రభుత్వ పథకాలు తదితర విషయాలను గ్రామపంచాయతీ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లెల లక్ష్మీలక్ష్మణ్ గ్రామ కార్యదర్శి వెంకటేష్, కారోబార్ మాధవరావు, సాయి, ప్రభాకర్ ఉపాధ్యాయులు ఎం బాలయ్య, డి శంకరయ్య, పీఈటీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

హుజూరాబాద్: నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఏబీవీపీ నాయకులు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారని, విద్యాలయాలను కాస్త వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని, అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రావణవేణి రోహిత్ , కాంతాల పూర్ణ చంద్రారెడ్డి, గడ్డం విజయ్ కుమార్, చిర్రా శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

హుజూరాబాద్‌రూరల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేష్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో చందుపట్ల వెంకటేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరిక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. యువత కోసం టోర్నమెంట్ నిర్వహించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరందాములు, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు యాదగిరి, మాజీ ఉప సర్పంచ్ రాజేందర్, సురేందర్, శ్రీనివాస్, రమేష్, అశోక్, శ్రావణ్, నారాయణ, సమ్మయ్య, అజయ్, సురేష్, సుమన్ పాల్గొన్నారు.

భూతగాదాలు పరిష్కరించుకోవాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ఉపేంద్రచారి

చొప్పదండి: భూతగాదాలను ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సివిల్ తగాదాలకు పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం ఉండదని ఎస్ఐ ఉపేంద్రచారి అన్నారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదుదారులు, ఇతరులకు ఏఎస్ఐ యూసూఫ్ షరీఫ్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసుకోవద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి ద్విచక్ర వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కరాచారి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు.. ఉపాధి కూడగట్టు

- స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు

రామడుగు: మండల కేంద్రంలోని ఓ స్వచ్ఛంద సంస్థ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా కుట్టుశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుంది. రామడుగులో ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాదాపు 30 మంది చొప్పున నలభై రోజుల పాటు ఉచితంగా పలురకాల దుస్తుల కుట్టుపై శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిగా రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వీ ఫర్ నీడి ఫౌండేషన్, హెల్పింగ్ హార్ట్స్ మాధురి టైలరింగ్ శిక్షణ కేంద్రం సహాయ సహకారంతో శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. ఏప్రిల్ 16 నుంచి స్వచ్ఛంద సంస్థ శిక్షణ తరగతులను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు.

మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు

కుట్టు శిక్షణతో పాటు స్వచ్ఛంద సంస్థ వారు





శిక్షణ పొందుతున్న మహిళలు, సర్టిఫికెట్స్ అందజేస్తున్న తహసీల్దార్(ఫైల్)

మహిళలకు రాజ్యాంగం, చట్టాలు, ఆన్‌లైన్ మోసాలపై స్థానిక ఎస్సై అంజయ్యతో అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనపై అవగాహన కల్పించి ఉచితంగా బీమా చేయించి పత్రాలను అందిస్తున్నారు. ట్రెనింగ్ సెంటర్‌లో వివిధ రకాల దుస్తులు కుట్టే విధంగా శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 18న శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పొందిన మహిళలకు తహసీల్దార్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

అందరి సహకారంతో...



యువజన సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రత్యేకంగా శిక్షణ కేంద్రం అందరి సహాయసహకారాలతో ఏర్పాటు చేసి విజయవంతంగా కొనసాగిస్తున్నాం.

– గజ్జెల అశోక్, యువజన సంఘాల మండల అధ్యక్షుడు

ఉపయోగకరంగా ఉంటుంది



దాదాపుగా నెలరోజులకు పైగా 30 మంది మహిళలకు ఇచ్చే కుట్టు శిక్షణ ఉపయోగకరంగా ఉంటుంది. శిక్షణ తర్వాత ఇంటివద్ద కుట్టు పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా సహాయపడే అవకాశం ఉంది.

– మాధురి గౌడ్, ట్రైనర్

నిర్వాహకులకు కృతజ్ఞతలు



కుట్టు శిక్షణ తరగతుల్లో అన్నిరకాల దుస్తులు కుట్టే విధానంపై ట్రైనర్స్ శిక్షణ ఇస్తున్నారు. కేంద్రం ఏర్పాటు చేసి కుట్టు శిక్షణ, ఇతర అంశాలపై అవగాహన కల్పించిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– జిట్టుపల్లి రేణుక, శిక్షణ పొందిన మహిళ

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

హుజూరాబాద్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరస్పర ఆరోపణలు మానుకొని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, వ్యక్తిగత స్వార్థంతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి ఆరోపించారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. నియోజవర్గ ప్రజల కనీస మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలు, ప్రెస్‌మీట్‌లు పెట్టి బురదజల్లుకోవడం మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రుణమాఫీ హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిస్ బ్యాంకుల్లోని నల్లధనాన్ని ప్రతి ఒక్కరి అకౌంట్లో జమ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు హామీ ఎటు పోయిందని ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకం కింద రూ. మూడు లక్షలు సరి



మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి

పోవని రూ. పది లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని, అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని రాబోయే కాలంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనలకు ప్రజానీకం కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జోన్ కమిటీ కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు వడ్ల రాజు, కదిరే రమేష్‌లు పాల్గొన్నారు.

'ఏళ్లు గడుస్తున్నా హామీల అమలేది?'

గంగాధర: గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో 56 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు శనివారం మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. దీక్షకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని, ముఖ్యమంత్రి మండలంగా ప్రకటించి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. లేకుంటే గ్రామస్తులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు వెంటనే పరిహారం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిహారం మండలంలోని రంగరావుపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బొడిగ శోభ

చేపట్టిన నిరాహార దీక్షను సందర్శించారు. పరిహారం ఇవ్వడంలో సంవత్సరాలుగా జాప్యం జరుగుతుందన్నారు. వెంట బీజేపీనాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, రేండ్ల శ్రీనివాస్, రాజశేఖర్,సిరిమల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున నెత్తిన పోచమ్మ బోనాలు, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ ప్రజలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. చల్లగా ఉండాలని మొక్కలు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ కేతిరెడ్డి వనిత, జెడ్పీటీసీ ఇనుకొండ శైలజ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ హాజరై బొడ్రాయి, పోచమ్మను దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ మేడి అంజయ్య ఉపసర్పంచ్ పొన్నం అనిల్, పంచాయతీ కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు, నార్ల అశోక్ అక్కపెల్లి కవిత,పారునంది రేవతి,పారునంది సంపత్



గుర్రం సునంద,గడ్డం స్వరూప,బీనపల్లి మాధవి తూముల శ్రీనివాస్, కో ఆప్షన్ శ్రీ మున్నూరు గోవిందరావు సుదగోని తిరుమల,తునికి కనుకయ్య ప్రజా ప్రతినిధులు కుల సంఘాల అధ్యక్షులు గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గంగాధర: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని గంగాధర ఎస్సై అభిలాశ్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావద్దని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు.

పోలీసుల సేవలు వినియోగించుకోవాలి

చిగురుమామిడి: పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు పోలీసుల సేవలు వినియోగించుకోవాలని ఎస్సై సామల రాజేశ్ కోరారు. శనివారం మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులు, మహిళల భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు.

షీ టీమ్స్‌పై విద్యార్థినులకు అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపైలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో శనివారం 9, 10వ తరగతి విద్యార్థినులకు షీ టీమ్స్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్సై రాజన్న మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మహిళల రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు.

పరామర్శ

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన వంచ శ్రీకాంత్‌రెడ్డి విద్యుత్ షాక్‌తో మృతి చెందగ శనివారం ఆయన కుటుంబ సభ్యులను టీపీసీసీ ఆధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం పరామర్శించారు. శ్రీకాంత్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ జీపీ పరిధి తోకలపల్లిలో ఇటీవల మ్యాకల చంద్రయ్య మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని శనివారం ఎంపీపీ ఇరుమల్ల రాణి సురేందర్ రెడ్డి పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మానకొండూర్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. గడపగడపకూ కవ్వంపల్లిలో భాగంగా మండల కేంద్రంలో రెండోరోజు శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

హ్యాండ్‌బాల్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న క్రీడాకారులు

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం రాత్రి క్రీడాకారులు ప్రపంచ హ్యాండ్‌బాల్, ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకొని క్రీడాకారులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మన్, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, బసరవేణి లక్ష్మణ్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మోత్కులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హుజూరాబాద్, జమ్మికుంట(ఐఎంఏ) ఆధ్వర్యంలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అంకం సుధాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల రోగాలకు పరీక్షలు నిర్వహిస్తామని, పట్టణ, ఇతర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డా. ఉడుగుల సురేష్, కోశాధికారి డా.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆర్నకొండలో చెక్‌పోస్టు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ శివారులో పోలీసులు గోవుల అక్రమ రవాణా అరికట్టడానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. సీఐ రవీందర్ చెక్‌పోస్టును ప్రారంభించారు. హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి, వెటర్నరీ, రెవెన్యూ ఉద్యోగులు కరీంనగర్, రాయపట్నం రోడ్డుపై పహారా కాస్తున్నారు. వాహనాల తనిఖీ చేపట్టారు.

దరఖాస్తు చేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: రైతుబంధు 2023 వానాకాలం సీజన్‌కు 19 జూన్ 2023 వరకు పట్టాపాస్‌బుక్‌లు వచ్చిన రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ వ్యవసాయాధికారి ఎ.సునీత శనివారం తెలిపారు. రైతుల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారి లాగిన్‌లలో వచ్చి ఉన్నందున సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రైతు బంధు దరఖాస్తు ఫారంతో సంప్రదించి ఆన్‌లైన్‌లో జూలై 3 లోపు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థికి అభినందనలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాలకు చెందిన కాసారపు చరిత చొప్పదండి నవోదయ పాఠశాలలో సీటు సాధించింది. ఈసందర్భంగా శనివారం పాఠశాల కరస్పాండెంట్ మునుకుల మునీందర్ చరితను అభినందించారు.

విజ్ఞానయాత్రకు రైతులు



మానకొండూర్: వ్యవసాయ, ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి 50 మంది రైతులు విజ్ఞానయాత్రలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటకు వెళ్లారు. అధికారులు ఆయిల్ పామ్ సాగు వివరాలను రైతులకు వివరించారు. కోతుల బెడద ఉండదని, కచ్చితమైనా మార్కెటింగ్ వసతి ఉంటుందని తెలిపారు. లోహియా కంపెనీ ప్రతినిధి ప్రవీణ్‌పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించాలి

జమ్మికుంట: విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించాలని డీఈవో జనార్దన్‌రావు, ఏఎంవో అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. రీడింగ్‌లో విద్యార్థులు ముందంజలో ఉంటే ఇతర అంశాల్లో మొదటి స్థానంలో ఉంటారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం సునీత, సురేష్, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

శంకరపట్నం: విద్యార్థులను గ్రూపులుగా విభజించి దత్తత తీసుకోవాలని డీఈవో జనార్దన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను శని



శంకరపట్నం: మాట్లాడుతున్న డీఈవో, ఇతరులు

వారం సందర్శించారు. ఉపాధ్యాయుల బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తరగతి గదుల్లో బోధించిన పాఠాలను విద్యార్థులు రాసి, చదువుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. వెంట ఏఎంవో అశోక్‌రెడ్డి, హెచ్ఎం ఆనందం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేటు కాలేజీల్లో విద్య

చొప్పదండి: గణిత పరీక్షలో ప్రతిభా చూపిన పేద విద్యార్థులను ఎంపిక చేసి ఉచిత విద్యను అందిస్తోంది మండలంలోని రెవెళ్లి గ్రామానికి చెందిన సదిశ సంస్థ. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 21 మంది విద్యార్థులను జిల్లాలో పేరొందిన ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ విద్య చదివించేందుకు శనివారం కళాశాలల్లో చేర్పించారు. పదేళ్లుగా పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇప్పటి వరకు 165 మందికి ఇంటర్ విద్య అందించామన్నారు. పేదరికం నుంచి ఉన్నత చదువులు చదివిన రెవెళ్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల గోవర్దన్ రెడ్డి మిత్రుల సహాయంతో 270 మంది వలంటీర్లతో సదిశ సంస్థను నడిపిస్తున్నారు. కరీంనగర్‌తో పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో



ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులు

విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మహారాష్ట్రలోని నాందేడ్‌లో ప్రతిభ పరీక్ష నిర్వహించి హాస్టల్ సౌకర్యంతో కూడిన విద్యను అందిస్తున్నారు. ఎంపికైన విద్యార్థులను సదిశ డైరెక్టర్లు ద్యావ నవీన్ రెడ్డి, గజ్జెల ప్రవీణ్, రవి అభినందించారు.

విద్యార్థులను దత్తత తీసుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు,నోట్‌బుక్స్, ఇతర సామగ్రి అందిస్తున్న ఎన్ఆర్ఐ జగన్‌మోహన్ రెడ్డి

చొప్పదండి: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకొని వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డు గ్రహీత వెల్మ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వెల్మ జగన్‌మోహన్ రెడ్డి మైక్‌సెట్, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, నోటుబుక్స్, ఇతర సామగ్రిని ఎంఈవో వేణుకుమార్ సమక్షంలో అందించారు. కార్యక్రమానికి హాజరైన మల్లారెడ్డి.. పేద విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలకు ఫ్యాన్లు విరాళంగా ఇస్తున్నట్లు సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం బిజిలి కనుకయ్య, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ పెద్దెల్లి సురేశ్, పెద్దెల్లి అంజయ్య, ఏనుగు స్వామిరెడ్డి, గాండ్ల లక్ష్మణ్, ఎల్లారెడ్డి, ఎవన్‌రెడ్డి, జగన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి కరపత్రాల పంపిణీ

గంగాధర: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీఎం నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, చేపట్టిన పథకాలపై శనివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, అమలు చేస్తున్న పథకాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపు నిచ్చారు.

శంకరపట్నం: కేశవపట్నంలో బీజేపీ నాయకులు గడపగడపకూ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. మానకొం



శంకరపట్నం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగరాజు

డూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనను వివరిస్తూ కరపత్రాలను అందించారు. మండల అధ్యక్షుడు అనిల్, సారయ్య, వీరార్జున్, రాజిరెడ్డి, నరేందర్, మహేందర్, శివారెడ్డి, రాజేందర్ ఉన్నారు.

వీడ్కోలు హంగామా



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. శనివారం కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ... మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు కంప్యూటర్ రంగంపై మరింత పట్టు సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగ సాధనలో విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్తే ఉద్యోగ సాధన కష్టమేమికాదని అన్నారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. వెంకటయ్య, కంప్యూటర్ సైన్స్ అధిపతి రవీంద్రబాబు, వివిధ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ కులస్తులు దహనం చేశారు. ముదిరాజ్‌లను అసభ్య పదజాలంతో దూషించినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించారు. యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌ను కులం పేరుతో దూషించి దాడి చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, గుండాగిరీ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అగౌరవంగా మాట్లాడిన పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షమాపణ చెప్పకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ కులస్తులు దహనం చేశారు.